క్లుప్తంగా

విద్యార్థికి అభినందనలు



నందిగామటౌన్: జాతీయ స్థాయిలో జరిగిన లాక్రోస్ గేమ్స్ చాంపియన్ షిప్ పోటీలలో బ్రాంజ్ మెడల్ సాధించిన విద్యార్థి ఓర్సు వెంకటేశ్వరరాజ్‌ను గురువారం స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. ఈసందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ వెంకటేశ్వరరాజ్ భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి తండ్రి, వైఎస్సార్ సీపీ నాయకుడు ఓర్సు ఏడుకొండలరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఆలయ కమిటీల కోసం దరఖాస్తుల ఆహ్వానం

నందిగామరూరల్: మండలంలోని ఆయా ఆలయాల కమిటీ సభ్యుల నియామకానికి దేవాదాయశాఖ ఉత్తర్వులు జారీ చేసిందని గ్రూపు దేవాలయాల ఈఓ నరసింహమూర్తి గురువారం తెలిపారు. మాగల్లులోని మదన గోపాలస్వామి, లింగాలపాడులోని లక్ష్మీ పేరంటాళ్లు అమ్మవారు, దాములూరు కూడలిలోని సంగమేశ్వర స్వామి, పట్టణంలోని సీతారామాంజనేయ స్వామి ఆలయాలకు పాలకవర్గ సభ్యుల నియామకం కోసం ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తులను ఆయా ఆలయాల్లో అందజేయాలని ఈఓ సూచించారు.

శ్రీకృష్ణుడి విగ్రహ ప్రతిష్ట



చందర్లపాడు(నందిగామరూరల్): చందర్లపాడు మండలం పాతబెల్లంకొండవారిపాలెం గ్రామంలో గురువారం శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి విగ్రహ ప్రతిష్టా కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రతిష్టా మహోత్సవంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గీతాసారంతో జీవితసారాన్ని తెలిపిన శ్రీకృష్ణుని విగ్రహ ప్రతిష్టా కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. శ్రీకృష్ణుడి ప్రతిష్ఠ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.

మహనీయుల జీవితాలను ఆదర్శంగా తీసుకోవాలి



ముచ్చింతాల(పెనుగంచిప్రోలు): మహనీయుల జీవితాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందా కృష్ణమాదిగ అన్నారు. ముచ్చింతాలలో ఏర్పాటు చేసిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రాం విగ్రహాలను గురువారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మందా కృష్ణ మాట్లాడుతూ ప్రతిఒక్కరు విద్యావంతులు కావాలన్నారు. విద్యతోనే ఏదైనా సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జక్కులూరి రాంబాబు, బహుజన రాష్ట్ర నాయకులు బచ్చలకూర పుష్పరాజ్, విగ్రహాల కమిటీ ఆర్గనైజర్ బెల్లంకొండ పరమయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు మందా వెంకటేశ్వరరావు, పేరెల్లి ఎలీషా, కోటా డానియేలు, శ్యామ్‌ప్రసాద్, పెద్ద అంజయ్య, పి వెంకటాద్రి, బి కిషోర్, సెల్విన్ జోన్స్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేలకూలిన చెట్లు



వీరులపాడు: మండలంలో గురువారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు భారీ చెట్లు నేలవాలాయి. మధ్యాహ్నం వరకు భానుడు విజృంభించినప్పటికీ సాయంత్రం సమయంలో ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై బలమైన ఈదురుగాలులతో కూడిన చిరుజల్లులు పడ్డాయి. ఈదురుగాలులకు పెద్దాపురం–ఎర్రుపాలెం రహదారిలోని భారీ వృక్షాలు రోడ్డుపై అడ్డుగా పడటంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. రహదారి పక్కనున్న గుంతల్లో భారీ వాహనాలు ఇరుక్కుని వాహనాలు నిలిచిపోవడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. చిరుజల్లులు పడటంతో కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం, మొక్కజొన్న పంటలను కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు పరుగులు పెట్టారు.

అద్భుతంగా నిర్మించారు...లక్షణంగా వదిలేశారు!

- రూ.1.80 కోట్లతో కల్యాణ మండపం నిర్మాణం..
- డైనింగ్‌హాల్, కిచెన్ పనులు పెండింగ్
- నిరుపయోగంగా మారిన మండపం
- మారని ఆలయ అధికారుల తీరు
- ప్రైవేట్ వ్యక్తులకు లబ్ధిచేకూరేలా వ్యవహారం
- భక్తులపై తీవ్ర ఆర్థిక భారం



పెనుగంచిప్రోలులో నిరుపయోగంగా ఉన్న కల్యాణ మండపం

పెనుగంచిప్రోలు: శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి చెందిన మునేరు అవతల మామిడి తోటలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.1.80 కోట్లతో నిర్మించిన కల్యాణ మండపాన్ని వినియోగంలోకి తీసుకురావడంలో ఆలయ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఆలయానికి చెందిన కల్యాణ మండపాన్ని వినియోగంలో లేకపోవడంతో అమ్మవారి సన్నిధిలో ఆయా శుభ కార్యాలు నిర్వహణ కోసం ప్రజలు ప్రైవేట్ మండపాలకు ఏటా కోట్లాది రూపాయలు చెల్లించక తప్పడం లేదు. దీంతో ఆలయం కూడా భారీగా ఆదాయాన్ని కోల్పోతోంది.

రూ.13 కోట్లతో పనులు..

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం శ్రీ తిరుపతమ్మ ఆలయ అభివృద్ధికి అనేక చర్యలు చేపట్టింది. సుమారు రూ.13కోట్లతో ఆలయం వద్ద కల్యాణకట్టతో పాటు డార్మెటరీ, సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, మునేరు అవతల అమ్మవారి మామిడి తోటల్లో కల్యాణ మండపం, షెడ్లు, ఏసీ గదులు తదితర నిర్మాణాలు చేపట్టారు. అయితే కల్యాణ మండపానికి అనుగుణంగా డైనింగ్ హాల్, కిచెన్ షెడ్‌ను నిర్మించే విషయంలో ఆలయ అధికారులు ఏడాదిగా మీనమేషాలు లెక్కిస్తున్నారు. దీంతో కల్యాణ మండపం నిరుపయోగంగా మారింది.



సగం కూల్చిన పాత ఓపెన్ ఆడిటోరియం

గతంలోనూ రూ.15 లక్షలు వృథా..

గతంలో కూడా ఇదే స్థలంలో సుమారు రూ.15లక్షలతో నిర్మించిన ఓపెన్ ఆడిటోరియాన్ని వినియోగించే విషయంలోనూ ఆలయ అధికారులు తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించారని భక్తులు గుర్తుచేసుకుంటున్నారు. ఈ ఓపెన్ ఆడిటోరియంలో ఒక్క కార్యక్రమాన్ని కూడా నిర్వహించకుండానే కొత్త కల్యాణ మండపం కోసం దానిని కూల్చివేసిన ఘనమైన చరిత్ర ఆలయ అధికారులది. ఓపెన్ ఆడిటోరియం కాస్తా మొండిగోడలుగా మారి ఆలయ అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా మిగిలాయి. ఇలా దేవుడి సొమ్మే కదా..వృథా చేస్తే ఎవరు అడుగుతారులే అన్నట్లుగా ఆలయ అధికారులు వ్యవహరిస్తుండటంపై భక్తులు పెదవి విరుస్తున్నారు.



జనంతో కళకళలాడుతున్న ప్రైవేట్ కల్యాణ మండపాలు

ఖాళీగా దర్శనమిస్తున్న భవనాలు..

కల్యాణ మండపంతోపాటు వెనుక రెండు మినీ ఫంక్షన్ హాల్స్, పక్కన నాలుగు ఏసీ గదులు, టాయిలెట్ బ్లాక్ మొత్తం సుమారు రూ.4కోట్లతో నిర్మించారు. కల్యాణమండపం ఉపయోగంలోకి రాక పోవడంతో మినీ ఫంక్షన్‌హాల్స్, ఏసీ గదులు కూడా ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

ప్రైవేట్ లబ్ధికోసమేనా?..

నిత్యయాత్రా స్థలంగా కొనసాగుతున్న పెనుగంచిప్రోలులో మునేరు అవతల పదుల సంఖ్యలో ప్రైవేటు కన్వెన్షన్లు, కల్యాణ మండపాలు ఉన్నాయి. వీటి ద్వారా ఏడాదికి సుమారుగా రూ.50 కోట్ల వ్యాపారం సాగుతున్నట్లు సమాచారం. పెనుగంచిప్రోలు అమ్మవారి సన్నిధిలో వివాహాది శుభకార్యాలు చేసుకునేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రజలు వస్తుంటారు. దీంతో తోటల యజమానులకు ఫుల్ డిమాండ్. దీంతో వారు అడిగినంత చెల్లించక తప్పని పరిస్థితి భక్తులది. ఇప్పటి వరకు కూడా మునేరు అవతల అమ్మవారి మామిడి తోటలు ఉన్నా ఎవరూ కూడా వాటి ఉపయోగానికి సరైన చర్యలు చేపట్టలేదు. అధికారుల అనాలోచిత నిర్ణయాల కారణంగా కల్యాణ మండపం పూర్తయింది కానీ దానికి అవసరమైన నిర్మాణాలు చేపట్టక పోవటంతో మండపం కాస్తా నిరుపయోగంగా మారింది. కల్యాణ మండపం, మామిడితోటలకు ఇంతటి డిమాండ్ ఉన్నప్పటికీ అమ్మవారి ఆలయానికి చెందిన వాటిని భక్తులకు అందుబాటులోకి తేవడంలో మాత్రం ఆలయ అధికారులు శ్రద్ధ చూపకపోవడం గమనార్హం. ప్రైవేట్ వ్యక్తులకు లబ్ధి చేకూర్చడం ద్వారా అధికారులు కూడా తమ స్వలాభాన్ని చూసుకుంటున్నారనే విమర్శలు భక్తుల నుంచి వినిపిస్తున్నాయి. ఇకనైనా ఆలయ అధికారులు స్పందించి కల్యాణమండపాన్ని వినియోగంలోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు.

ప్రజలకు అందుబాటులోకి తెస్తాం...



కల్యాణ మండపంలో రూ.4కోట్లతో కిచెన్ షెడ్, ఎయిర్ కండీషనింగ్, డ్రెయినేజీ, గ్రౌండ్ లెవలింగ్ పనులు చేపట్టేందుకు ఇప్పటికే అంచనాలు తయారుచేసి ఉన్నతాధికారులకు నివేదించాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపట్టి కల్యాణ మండపాన్ని ప్రజలకు అందుబాటులోకి తెస్తాం.

– ఎల్.రమ, ఆలయ ఈఈ

కనులపండువగా స్వామివారి కల్యాణం



చిట్టేల(వత్సవాయి) : శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణవెంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి స్వామి వారి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మార్నెళ్ల పుల్లారెడ్డి వారి సోదరుల దంపతులు పీటలపై కూర్చుని స్వామివారి కల్యాణాన్ని జరిపించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణ మహోత్సవాన్ని తిలకించారు. ప్రవచనకర్త గరికిపాటి నరసింహరావు ప్రవచనాలు భక్తులను ఆకట్టుకున్నాయి. అర్చకులు సిరికొండ సాయికృష్ణమాచార్యులు, ప్రసాద్ శర్మ ఆధర్యంలో పూజా కార్యక్రమాలు సాగాయి. జనసేన జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభానుతోపాటు పలువురు స్వామివారి దర్శించుకుని పూజలు చేశారు.

కొనసాగుతున్న ఉత్సవాలు

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసి యున్న యోగానంద లక్ష్మీ నరసింహస్వామి వారి తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజు గురువారం రాత్రి అంకురార్పణ, ధ్వజారోహణ కార్యక్రమాలను అర్చకులు అత్యంత వైభవంగా నిర్వహించారు. అర్చకులు పరాంకుశం వాసుదేవాచార్యులు ఆధ్వర్యంలో ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు చేసి, కల్యాణ మహోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఆలయ ఈఓ సురేష్ బాబు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

'సాక్షి' ఎడిటర్‌పై కేసు నమోదు అమానుషం



నందిగామ ఆర్డీఓ ఆఫీసు వద్ద నల్లబ్యాడ్జిలతో నిరసన వ్యక్తం చేస్తున్న విలేకరులు

- నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేసిన విలేకరులు
- ఆర్డీఓకు వినతిపత్రం అందజేత

నందిగామటౌన్: 'సాక్షి' దినపత్రిక ఎడిటర్ ధనుంజయ్‌రెడ్డిపై పోలీసుల చర్య అమానుషమని మీడియా, పాత్రికేయ ప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పాత్రికేయ సంఘాల ఆధ్వర్యంలో పోలీసుల చర్యను నిరసిస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి గురువారం స్థానిక ఆర్డీఓ ఆఫీసు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీఓ కె.బాలకృష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు విలేకరులు మాట్లాడుతూ రాష్ట్రంలో విలేకరులపై అక్రమ కేసులు బనాయించడం బాధాకరమన్నారు. నిజాయితీగా వార్తలు ప్రచురిస్తున్నప్పటికీ అక్రమ కేసులు పెడుతూ ఇబ్బందుల పాలు చేస్తున్నారన్నారు. ముఖ్యంగా ప్రజాసమస్యలను వెలుగులోకి తెస్తూ ప్రభుత్వ వ్యతిరేక వార్తలు రాస్తున్నారనే అక్కసుతోనే 'సాక్షి'దినపత్రిక ఎడిటర్‌పై ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. ముందస్తు నోటీసులు ఇవ్వకుండా నిర్బంధ సోదాలు చేయడం తగదన్నారు. ధనుంజయరెడ్డితో పోలీసులు వ్యవహరించిన తీరు అమానుషమన్నారు. ఏడాదిగా రాష్ట్రంలో పత్రికా స్వేచ్ఛను హరించేలా ఘటనలు చోటుచేసుకుంటున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పాత్రికేయులు, మీడియా ప్రతినిధులపై మోపిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యూ ఇండియన్ జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు మీరాహుస్సేన్‌ఖాన్, ఐడీజేఏన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ముప్పాళ్ల శివాజీ, మీడియా, పాత్రికేయ ప్రతినిధులు ఆకుల వెంకట నారాయణ, ఎస్ఎన్ శ్రీనివాసరావు, సాంబశివరావు, అప్పారావు, పఠాన్ సైదాఖాన్, షేక్ ముస్తఫా, వెలది సుగుణశేఖరరావు, కుద్దూస్, అన్నవరపు చంద్రశేఖర్, బొక్కా ప్రభాకరరావు, శిఖా సురేష్, శ్రీనివాసరావు, ఐలపోగు రవికుమార్, ఇందూరి ముకుంద రెడ్డి, టీవీ నరసింహారావు, పలువురు పాత్రికేయులు, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీస్సులు



గనిఆత్కూరు(కంచికచర్ల): మండలంలోని గని ఆత్కూరు గ్రామంలో గురువారం జరిగిన వైఎస్సార్ సీపీ నాయకులు దామినేని శివరాం సోదరుడు రవితేజ వివాహ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు, జిల్లా నాయకులు పాటిబండ్ల హరిజగన్నాధరావు, కాలవ వెంకటేశ్వరరావు, మార్త శ్రీనివాసరావు, తంగెళ్లమూడి రామారావు, చింతా రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

100 మందికి కంటి పరీక్షలు

నందిగామరూరల్: పట్టణంలోని 18వ వార్డులోని సర్వజనుల ప్రార్థనా మందిరంలో ఫాస్టర్ నరేష్ ఆధ్వర్యంలో స్థానిక నీరజ కంటి ఆస్పత్రి వైద్యులు గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కౌన్సిలర్ బంగారు గంగమ్మ ప్రారంభించారు. వైద్యులు 100మందికి కంటిపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. స్థానిక నాయకుడు బండారు శేషు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందికి అవగాహన

నందిగామరూరల్: నూతన కార్డులు, తెల్లరేషన్ కార్డుల కోసం వచ్చిన ప్రతి ఒక్క అర్జీని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి కార్డులు మంజూరు చేసేలా చూడాలని పౌర సరఫరాలశాఖ జిల్లా అధికారి పాపారావు సూచించారు. పట్టణంలోని అశోక్‌నగర్ సచివాలయ పరిధిలో నూతన కార్డుల మంజూరుకు సంబంధించిన నిబంధనలపై సచివాలయం సిబ్బందికి అవగాహన కల్పించారు. డీటీ రామ్మూర్తి రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రిలో మాక్‌డ్రిల్

నందిగామటౌన్: స్థానిక ప్రభుత్వాస్పత్రిలో గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రమాదాల సమయంలో ప్రజలు వ్యూహాత్మకంగా వ్యవహరించాలని సూచించారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్యకు ఘననివాళి

నందిగామటౌన్: ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆరు లక్షల ఎకరాల అసైన్డ్ భూమిని పంపిణీ చేసి తెలుగు ప్రజల హృదయాల్లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని నందిగామ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అద్దంకి మణిబాబు కొనియాడారు. నందిగామలో దామోదరం సంజీవయ్య 53వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మణిబాబుతో పాటు పలువురు న్యాయవాదులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మణిబాబు మాట్లాడుతూ అవినీతి నిరోధక శాఖను ఏర్పాటు చేయటంతోపాటు వృద్ధాప్య పింఛన్ పథకాన్ని ప్రారంభించిన ఘనత దామోదరం సంజీవయ్యకే దక్కుతుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా సంజీవయ్య ప్రజలకు ఎనలేని సేవలందించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉగ్రస్థావరాల ధ్వంసంపై హర్షం



భారత సైన్యానికి సంఘీభావం తెలియజేస్తున్న జగ్గయ్యపేట న్యాయవాదులు



జాతీయజెండాలను ప్రదర్శిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు

జగ్గయ్యపేటఅర్బన్: ఆపరేషన్ సిందూర్ పేరుతో భారతసైన్యం పాకిస్తాన్ ఉగ్రవాదులపై దాడిచేయడంపై జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సంఘీభావం ప్రకటించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు అధ్యక్షతన సంఘీబావ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు హాజరై ముక్తకంఠంతో త్రివిధ దళాల సైనికులకు జేజేలు పలుకుతూ సంఘీబావం తెలిపారు. న్యాయవాదులు బద్దుల వెంకట్రామయ్య, జి.శ్రీనివాసగౌడ్, పసుపులేటి సత్యశ్రీనివాసరావు, జూనెబోయిన శ్రీనివాసరావు, గుంటక లక్ష్మీనారాయణ, దాసరి నాగేశ్వరరావు, ఎం.ఆంజనేయులు, ఆరేపల్లి వెంకటేశ్వర్లు, డి.సంతోష్, శోభతోరణ, పూల నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా భారతసైన్యం తీరుకు మద్దతు పలుకుతూ విమలాభాను ఫౌండేషన్ చైర్మన్ సామినేని విమలాభాను స్థానిక ఆనందసాయి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జగ్గయ్యపేట జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడామైదానంలోని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, సమ్మర్ క్యాంపు క్రికెట్ క్రీడాకారులు ఆనందోత్సహాలు వ్యక్తం చేస్తూ ప్రదర్శన చేశారు. జైహింద్..భారతమాతాకీ జై అంటూ నినాదాలు చేశారు.

రసాభాసగా ఆలయ పాలకవర్గ సమావేశం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి ఆలయ పాలకవర్గ సమావేశం రసాభాసగా సాగింది. ఆలయంలో గురువారం చైర్మన్ జంగాల శ్రీనివాసరావు అధ్యక్షతన పాలకవర్గ సమావేశం నిర్వహించారు. అమ్మవారి చిన్నతిరునాళ్ల, పెద్ద తిరునాళ్లకు సంబంధించి లోపాలు ఉన్నాయని సమగ్ర విచారణ చేయాలంటూ ఆలయ చైర్మన్ శ్రీనివాసరావు, దేవాదాయ శాఖ కమిషనర్, విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయడం పాలకవర్గ సమావేశంలో చైర్మన్, ఈఈ ఎల్ రమకు మధ్య కొంత వాగ్వాదానికి దారితీసింది. తిరునాళ్ల ఖర్చులపై తనకు అనుమానం ఉందని, ప్రతి బిల్లు తనకు చూపించాలని చైర్మన్ ప్రశ్నించారు. సందేహాలను నివృత్తి చేయాలని చైర్మన్ అడుగగా, ప్రతిది బిల్లు ప్రకారమే ఖచ్చితంగా చేశామని ఈఈ వివరించారు. అయితే తనకు ప్రతి బిల్లు సక్రమంగా చూపించాకే సంతకం చేస్తామని చైర్మన్ స్పష్టం చేయగా, ఆదాయ వ్యయాలకు సంబంధించి బిల్లులు శుక్రవారం చూపిస్తామని అధికారులు తెలిపారు.



సమావేశంలో ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఈఓ కిషోర్‌కుమార్, పాలకవర్గ సభ్యులు అజెండాలోని అంశాలపై చర్చ..

సమావేశంలో భాగంగా అజెండాలోని అంశాలపై చర్చించారు. నూతన అన్నదాన భవనం, కార్యాలయ భవనం నిర్మాణం, మొదటి పొంగళి షెడ్డును 5 దుకాణాలుగా మార్చుట, పాత కేశఖండనశాలను పొంగళి షెడ్డుగా మార్చుట, డార్మెటరీ, కేశఖండనశాల తదితర పనులు చేపట్టడంపై సమావేశంలో చర్చించారు. ఆలయ ఈఓ కిషోర్‌కుమార్, ఏఈఓలు ఉమాపతి, తిరుమలేశ్వరరావు, ఏఈ రాజు, పాలకవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీసీలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం

జగ్గయ్యపేట అర్బన్: రాష్ట్రంలో బీసీ మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ పథకం పేరుతో రూ.154 కోట్ల భారీ స్కాంకు కూటమి ప్రభుత్వం తెర లేపిందని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తుల రామారావు విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కుట్టుశిక్షణ, మిషన్ల పంపిణీ పేరుతో ఒక్కో లబ్ధిదారుడి కోసం ప్రభుత్వం రూ.23వేలు కేటాయించగా, వాస్తవంలో ఒక్కో లబ్ధిదారుడిపై కేవలం రూ.7300 మాత్రమే ఖర్చవుతోందని వివరించారు. లక్ష మందికి కుట్టుమిషన్లు, శిక్షణ కింద రూ.73కోట్లు ఖర్చవుతుండగా, మరో 167కోట్లను బీసీల పేరుతో దోచుకునేందుకు ప్రభుత్వపెద్దలు కుట్రలు చేస్తున్నారన్నారు. బీసీ సెల్ జగ్గయ్యపేట నియోజకవర్గ అధ్యక్షుడు జవ్వాజి నరసింహారావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పదివేల మంది కూడా ఈ శిక్షణకు హాజరుకావడం లేదన్నారు. బీసీల పేరుతో ప్రభుత్వ సొమ్ము దోచుకుంటున్న పాలకులకు భవిష్యత్‌లో బీసీలు తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ హఫీజున్నీసాఫిరోజ్, పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి చల్లా వైకుంఠరావు, నియోజకవర్గ పెన్షనర్స్, ఎంప్లాయిస్ విభాగం అధ్యక్షుడు దర్శి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ ప్రచార విభాగం అధ్యక్షుడు బైరబోయిన బాబు, లీగల్ సెల్ అధ్యక్షుడు ఓర్సు రాజు, మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు షేక్ మున్నిహీరా, గ్రామ పార్టీ అధ్యక్షుడు శీలం ప్రభాకర్, న్యాయవాది శివరాత్రి పృథ్వీ, బీసీ నేత గుడిమెట్ల శంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బత్తుల రామారావు, పక్కన జవ్వాజి నరసింహారావు తదితరులు

అపరిశుభ్ర వాతావరణంలో లడ్డూ తయారీ



కొళాయి నీటిని వినియోగిస్తూ, చేతికి గ్లౌజులు కూడా లేకుండా పిండి కలుపుతున్న సిబ్బంది



అపరిశుభ్రంగా ఉన్న పోటు ప్రాంతం

వేదాద్రి(జగ్గయ్యపేట): భక్తులకు అత్యంత ప్రీతికరమైన యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి లడ్డూను తయారుచేసే పోటు అపరిశుభ్రంగా ఉండటంపై భక్తులు ఆందోళన చెందుతున్నారు. ఆలయానికి రూ.కోట్ల ఆదాయం వస్తున్నా, నాణ్యమైన లడ్డూను అందించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. ఈనెల 11న స్వామి వారి కల్యాణం జరగనుండటంతో ఏపీ, తెలంగాణ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు రానున్నారు. ఈక్రమంలో లడ్డూల తయారీని ప్రారంభించినప్పటికీ పోటులో సిబ్బంది కనీస నిబంధనలు కూడా పాటించడం లేదు. అపరిశుభ్ర వాతావరణంలో లడ్డూ తయారు చేస్తున్నారు. చేతులకు గ్లౌజ్‌లు కూడా లేకుండా పిండిని ఇష్టానుసారం కలుపుతున్నారు. తయారైనలడ్డూను రక్షణ మూతలు లేకుండా కుప్పగా పోసి వదిలేయగా, లడ్డూ తయారీ ప్రాంతంలో ఎలుకలు తిరుగుతుండటం గమనార్హం. తూకం ప్రకారం కూడా లడ్డూ తయారీ ఉండటం లేదని మొక్కుబడిగా తయారు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దేవాదాయశాఖ ఉన్నతాధికారులు స్పందించి లడ్డూ తయారీలో ఆలయ సిబ్బంది నిబంధనలు పాటించేలా చూడాలని భక్తులు కోరుతున్నారు.

రైతులకు వ్యవసాయ సామగ్రి పంపిణీ



రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే తాతయ్య

జగ్గయ్యపేట అర్బన్: వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా ప్రభుత్వం రైతులకు సబ్సిడీతో అందజేస్తున్న ఆధునిక యంత్ర పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) సూచించారు. పట్టణంలోని మార్కెట్ యార్డులో వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి సంబంధించి నియోజకవర్గంలోని జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాలకు చెందిన 131మంది రైతులకు రూ.19.5లక్షల విలువగల తైవాన్ స్ప్రేయర్లు, కల్టివేటర్లు, లెవెలింగ్ బ్లేడ్లు తదితర యంత్ర సామగ్రిని గురువారం ఎమ్మెల్యే తాతయ్య చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ రైతుసంఘాలకు 80శాతం సబ్సిడీతో డ్రోన్‌లను సరఫరా చేస్తారని, ఈ అవకాశాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జగ్గయ్యపేట ఏడీఏ సి.భవాని, వ్యవసాయశాఖ అధికారులు, టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.